క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు కొండల్

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు పెరికె కొండల్ యువ సాహితీ పురస్కారం అందుకున్నారు. బిర్లా ఆడిటోరియంలో కళావేదిక నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన సాహితీ పట్టాభిషేకం మహోత్సవంలో ఆయనకు అందజేశారు. ఇప్పటివరకు ఆయన 200 పైగా పద్యాలు రాయగా.. జనని కంద పద్యా శతకాన్ని రాస్తున్నారు. తన ప్రతిభను గుర్తించి కళావేదిక వారు పురస్కారాన్ని అందించడం గర్వంగా ఉందన్నారు.

బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు



నర్సాపూర్ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్, పోలీసులు

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఎస్ఐ రంజిత్ రెడ్డి, డాగ్ స్క్వాడ్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలపై ముందస్తు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు.

కొంటూర్ చెరువుకు తగ్గిన వరద

హవేళిఘణాపూర్(మెదక్): భారీ వర్షాలకు మండల పరిధిలోని కొంటూర్ చెరువు అలుగు పారడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం వరద తగ్గడంతో సోమవారం శివ్వాయిపల్లి, మక్తభూపతిపూర్, గుట్టకిందిపల్లి, తిమ్మానగర్ ప్రాంతాలకు కొంటూర్ మీదుగా తరలివెళ్లారు.

వరి పంటల పరిశీలన



చిన్నశంకరంపేటలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త శ్వేత

చిన్నశంకరంపేట(మెదక్): వర్షాలకు వరి పంటలకు ఎలాంటి హాని కలగలేదని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త శ్వేత అన్నారు. సోమవారం మండలంలోని కొర్విపల్లిలో ఆమె వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీడపీడలు లేకుండ వరి పంటలు ఆరోగ్యకరంగా ఉన్నాయన్నారు. వరి గింజలు సైతం బలంగా నాణ్యతతో ఉన్నాయన్నారు. అనంతరం నార్సింగిలోని వరి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్, ఏఈఓలు మధులిక, శ్యామ్, విజృంభణ, దివ్య ఉన్నారు.

నేపాల్ వ్యక్తి అదృశ్యం



టీకారం దామై

తూప్రాన్: నేపాల్ వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి బస్సులో బయలుదేరిన ఓ వ్యక్తి సోమవారం తూప్రాన్‌లో అదృశ్యమయ్యాడు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన టీకారం దామై(45) బతుకుదెరువు కోసం సికింద్రాబాద్‌కు ఇటీవల వచ్చాడు. అయితే తిరిగి ఈ నెల 27న నేపాల్‌కు బస్సులో బయలు దేరాడు. అయితే తూప్రాన్‌లో దాబా వద్ద బస్సు దిగిన ఆయన కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్న బ్రహ్మయ్యకు జేఐటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న చిన్నబ్రహ్మయ్య

మర్కూక్(గజ్వేల్): మండలంలోని దామరకుంట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య తెలంగాణ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ వెంకటరాములు, ఉపాధ్యాయులు పాఠశాలలో సోమవారం అభినందించారు. ఎంఈఓ మాట్లాడుతూ అవార్డుతోపాటు ఐదు వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారన్నారు.

చదువులమ్మా నమోస్తుతే..!

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం దుర్గాదేవి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అమ్మవారి మండపం వద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి అన్నదానం చేశారు.



నర్సాపూర్: సరస్వతీమాతగా దర్శనమిస్తున్న కన్యకా పరమేశ్వరీమాత



శివ్వంపేట: ప్రత్యేక అలంకరణలో సరస్వతీమాత



టేక్మాల్: బొడ్మట్‌పల్లిలో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు



పెద్దశంకరంపేటలో కుంకుమార్చనలు



హవేళిఘణాపూర్: మాచవరంలో..



మనోహరాబాద్: కాళ్లకల్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కౌడిపల్లి: వెంకటాపూర్(బి)లో దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో అక్షరాభ్యాసం

రైల్వే బ్రిడ్జి కింద నీరు తొలగింపు

- ప్రారంభమైన రాకపోకలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

సాక్షి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపలి రైల్వే అండర్‌పాస్‌లో చేరిన చెరువునీరును ఎట్టకేలకు సోమవారం మోటరు పంపుల సహాయంతో తొలగించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మిర్జాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జి కింద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయంపై ఈ నెల 27న సాక్షిలో 'చెరువును తలపిస్తున్న రైల్వే బ్రిడ్జి' కథనం రావడంతో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్పందించారు. విద్యుత్‌శాఖ ఎస్సీతో మాట్లాడి మోటర్లతో నీటిని తొలగించేందుకు విద్యుత్ సరఫరాను చేయాలని ఆదేశించారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో బ్రిడ్జిలో చేరిన నీటిని తొలగించారు. దీంతో మిర్జాపల్లికి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.



మిర్జాపల్లి రైల్వే బ్రిడ్జి కింద నుంచి తొలగిన నీరు

ఎల్లేరు గడ్డ.. పోషకాలు పుష్కలం

- రత్నపూర్, పిల్లుట్ల అటవీలో లభ్యత
- సహజ సిద్ధంగా లభిస్తున్న వైనం
- తినేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు
- ఉపాధి పొందుతున్న స్థానికులు

శివ్వంపేట(నర్సాపూర్): సహజ సిద్ధంగా అటవీ ప్రాంతంలో లభించే ఎల్లేరు గడ్డలతో ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లోనే లభించే ఎల్లేరు గడ్డల సేకరణకు పలువురు తీవ్రంగా కష్టపడుతూ ఉపాధి పొందుతున్నారు. మండల పరిధిలోని రత్నపూర్, పిల్లుట్ల, శివ్వంపేట అటవీ ప్రాంతంలో భూమిపై కనిపించే ఎల్లేరు తీగను గుర్తించి గజం నుంచి రెండు గజాల లోతు వరకు తవ్వి వీటిని సేకరిస్తారు. అలా సేకరించిన గడ్డలను ముక్కలుగా చేసి ఉడికిస్తారు. ఆ తర్వాత పిండి ముద్దగా మారిన అనంతరం వాటిని వివిధ గ్రామాల్లో అమ్మకాలు చేపడుతూ స్థానికులు ఆర్థికంగా ఉపాధి పొందుతున్నారు.

పుష్కలంగా పోషక విలువలు

ప్రస్తుత సీజన్‌లో దొరికే ఎల్లేరు గడ్డల్లో పోషక విలువలు పుష్కలంగా ఉండడంతో మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. అటవీ ఆహారంగా భావించి వీటిని తినేందుకు చాల మంది ఆసక్తి కనబరుస్తున్నారు. పిండి పదార్థంగా ఉన్న ఎల్లేరు గడ్డలను చక్కరలో కలిపి తినడంతో పాటు పలువురు తీపి వంటలుగా చేసుకుంటారు. మండలంలోని అటవీ ప్రాంతంలో సేకరించిన ఎల్లేరు గడ్డలను శివ్వంపేట, నర్సాపూర్, తూప్రాన్, సంగారెడ్డి, మేడ్చెల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో అమ్మకాలు చేపడుతున్నారు. కిలో ఎల్లేరు గడ్డ రూ. 250 నుంచి రూ. 300 వరకు విక్రయిస్తున్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో మాత్రమే ఎల్లేరు గడ్డలు దొరుకుతాయని చెబుతున్నారు.



శివ్వంపేటలో ఎల్లేరు గడ్డలు విక్రయిస్తున్న రత్నపూర్ మహిళ

వైద్యం.. దైవాధీనం!

- పశువైద్యాస్పత్రిలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- అందుబాటులో ఉండని మందులు
- రైతులకు తప్పని ఇబ్బందులు

రేగోడ్(మెదక్): గతంలో ఎక్కడ చూసినా పాడి పశువులు కనిపించేవి. ప్రస్తుతం రోజురోజుకూ మారుతున్న తరుణంలో ఆ సంపద కనుమరుగవుతోంది. కానీ కొంత మంది రైతులు నేటికీ పశువులను పెంచుతూ వ్యవసాయం చేస్తున్నారు. అయితే ఆపద సమయంలో వైద్యం అందడం లేదు. అవసరమైన సిబ్బంది లేకపోవడంతో కావాల్సిన మందులు రాక నానా అవస్థలు పడుతున్నారు. వివరాల ప్రకారం.. మెదక్ జిల్లాలో రేగోడ్ మండలం మారుమూలంగా ఉండడంతో అందరికీ చిన్నచూపు కనిపిస్తుందని ప్రజల ఆరోపిస్తున్నారు. దీంతో ఈ మండలంలో సమస్యలు విలయ తండావం చేస్తున్నాయి. మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఈ పంచాయతీలల్లో రేగోడ్‌లో ఒకే ఒక పశువైద్యాస్పత్రి ఉంది. 2025 లెక్కల ప్రకారం గొర్రెలు, మేకలు కలిపి 16వేలు ఉండగా.. ఆవులు, బర్రెలు కలిపి 4,800 ఉన్నాయి. ప్రతీ రోజూ ఆస్పత్రికి చికిత్సల కోసం 15నుంచి 20 పశువులతో పాటు మేకలు, గొర్రెలను రైతులు తీసుకొస్తున్నారు. ఆయా వ్యాధులకు సంబంధించిన మందులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల అనారోగ్యంతో మేక చనిపోయాయని రైతు అక్బర్ ఆవేదన వ్యక్తం చేశాడు.



రేగోడ్ పశువైద్యాస్పత్రి

సిబ్బంది కొరత..

రేగోడ్ మండలంలో ఉన్న ఒకే ఒక్క పశువైద్యాస్పత్రిలో సిబ్బంది కొరత వేధిస్తుంది. ఆస్పత్రిలో ఒక వెటర్నరరీ అసిస్టెంట్, ఒక అటెండర్ పోస్టులు ఖాళీగా ఉంది. దీంతో ఒకే ఒక్క డాక్టర్ అన్నీ తానే చూస్తున్నాడు. సిబ్బందిని నియమించాలని కోరుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **జీవాలు చనిపోతున్నాయి**
>
> దవాఖానలో సిబ్బంది లేరు. మందులు సరిగా లేవు. వ్యాధులతో మేకలు చనిపోతున్నాయి. దవాఖానకు మందులను పంపించాలి. అలాగే సిబ్బందిని నియమిస్తే రైతులకు ఇబ్బందులు ఉండవు.
>
> – నర్సింహులు, రైతు, రేగోడ్

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామ శివారులో బొలెరోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. సుమారు 40 సంచుల రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి ఆ బియ్యాన్ని వాహనంతో కలిపి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

నర్సారెడ్డి పరామర్శ



పరామర్శిస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): ములుగులో ఇటీవల మృతి చెందిన డాకోజి వెంకటాచారి కుటుంబ సభ్యులను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సోమవారం పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట నాయకులు రమేశ్‌రెడ్డి, సలీం, కడపల్ల కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, కొండు నర్సింహులు పాల్గొన్నారు.

శీలాంపల్లి రోడ్డు పూర్తయ్యేనా..?

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలం ఏర్పాటై తొమ్మిదేళ్లు కావొస్తున్నా అభివృద్ధిలో ముందుకు వెళ్లడం లేదు. దీంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా శీలాంపల్లి గేటు నుంచి అంతారం గేటు వరకు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో సుమారు 9 కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ. 6.70 కోట్లు మంజూరయ్యాయి. ఇటావల పనులు చేస్తామంటూ గుత్తేదారు పాత బీటీ రోడ్డును పూర్తిగా తవ్వారు. అనంతరం శీలాంపల్లి వరకు మాత్రమే రోడ్డు వేయించి మరో 900 మీటర్ల రోడ్డు పనులు అలాగే వదిలేశాడు. దీంతో శీలాంపల్లి నుంచి శీలాంపల్లి గేటు వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షం పడితే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు వేయించాలని కోరుతున్నారు.



గుంతలమయమైన శీలాంపల్లి ప్రధాన రహదారి

వారికి ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వొద్దు

బీజేపీ నేత అశోక్‌గౌడ్

గజ్వేల్‌రూరల్: మతం మారిన వారికి ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేయకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రావణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ మతానికి సంబంధించిన కొందరు ఎస్సీ, ఎస్టీలు క్రిస్టియన్ మతంలోకి వెళ్ళి రిజర్వేషన్ ద్వారా సంక్షేమ పథకాలను పొందుతున్నారన్నారు. దీంతో అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శేఖర్, స్వామి, శ్రీకాంత్‌గౌడ్, చందు, అనిల్, నవీన్, లక్ష్మణ్, మహిపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బతుకమ్మ వేడుకలు

ప్రకృతి, పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు నిర్వహించుకునే ఈ ఉత్సవాల్లో ప్రధానమైంది సద్దుల బతుకమ్మ. ఈ వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా చేసుకున్నారు. ఇందులో భాగంగా ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, చామంతి, బంతి వంటి తీరొక్క పూలతో మహిళలు బతుకమ్మలను పేర్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఊరేగింపుగా ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



చిలప్‌చెడ్: ఫైజాబాద్‌లో సద్దుల బతుకమ్మ సంబరాల్లో మహిళలు



హవేళిఘణాపూర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కౌడిపల్లి: కూకుట్లపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మనోహరాబాద్: ముప్పిరెడ్డిపల్లిలో..



నర్సాపూర్: బతుకమ్మ సంబరాల్లో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ అనుసూయ



శివ్వంపేటలో బతుకమ్మలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు



రేగోడ్: బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు



వెల్దుర్తి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అల్లాదుర్గం: మాందాపూర్‌లో బతుకమ్మ సంబరాలు